
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 17 మే 2025

సరస్వతి పుష్కరాలకు..

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. ఈనెల 26 వరకు పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

7

ఉష్ణోగ్రత | గరిష్ఠం 38.5 | కనిష్ఠం 24.0

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో రబీ ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లుగానే రబీలో ప్రతీ గింజను కొనుగోలు చేస్తుందని, ఈ సంవత్సరం రబీలో 57లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగైందని, సన్నధాన్యం పండించిన రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసిన 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలో ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు సంబంధించి పత్రికల్లో వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి వివరణలు ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం సేకరణ వివరాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలియజేస్తూ జిల్లాలో ఈ రబీలో 5.57లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని, ఇప్పటివరకు 70 నుండి 80శాతం ధాన్యం కొనుగోలు చేశామని, సుమారు 5.14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. మరో 22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉందన్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి రబీలో 3,03,498 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 5,14,743 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 160శాతం ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు, టార్పాలిన్ల సమస్యలు లేవని, మొదట్లో రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టకుండా తీసుకురావడంతో సమస్య ఉండేదని, ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవన్నారు. జిల్లాలో ఎనిమిది రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తికానున్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



హజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని దేవాలయ భూములు

మాన్యం భూములపై నజర్

దేవాదాయశాఖ పరిధిలోని భూములపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. భూభారతి చట్టం అమల్లోకి రావడంతో ప్రభుత్వ భూములు, దేవాదాయశాఖ పరిధిలోని భూముల లెక్క తేల్చాలని నిర్ణయించింది. దేవాదాయశాఖ పరిధిలోని వేలాది ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఫిర్యాదులు దశాబ్దాలుగా వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

- భూముల లెక్కతేల్చేందుకు రంగం సిద్ధం
- జీడీపీఎస్ ద్వారా సర్వేకు సన్నద్ధం
- ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు
- ఉమ్మడి జిల్లాలో కబ్జాదారుల గుప్పిట్లో విలువైన మాన్యం భూములు
- భూములన్నీ స్వాధీనం చేసుకుంటే ఆలయాలకు మహర్దశే

రూ. కోట్ల విలువైన భూములను సంరక్షించకపోతే భవిష్యత్‌లో దేవాదాయ శాఖ ఆస్తులను కోల్పోవాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్న సందర్భంలో భూముల సంరక్షణకు ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. తాజాగా భూభారతి అమల్లోకి రావడంతో దేవాదాయశాఖ భూములను గుర్తించడానికి సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. రెవెన్యూ, దేవాదాయ శాఖ రికార్డుల ఆధారంగా సర్వేచేసి దేవాదాయ శాఖ భూములను గుర్తించి కంచె వేయాలనే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ సర్వేకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒక జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారవర్గాల్లో చర్చ సాగుతోంది.

యథేచ్ఛగా ఆక్రమణల పర్వం

దేవాలయాలకు ధూప, దీప, నైవేద్యాల నిమిత్తం సంస్థానాధీశుల కాలం నుంచి నిర్మాణ సమయంలోనే భూములను భూదాతలు విరాళాలుగా కేటాయించారు. ఆ భూములపై వచ్చే కౌలు ఆధారంగా దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు సమర్పించడంతోపాటు, ఉత్సవాలు, పూజారులకు జీతభత్యాలు అందేలా ఏర్పాట్లు చేశారు. అయితే కాలక్రమంలో భూముల విలువలు పెరగడం, భూములకు సాగునీరు అందుబాటులోకి రావడం, అదేవిధంగా సమీప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ ప్రభావం ఉండడం వంటి కారణాలతో ఆలయాల భూములు అన్యాక్రాంతమవడం మొదలైంది. ప్రతి జిల్లాలో ఉండే ఆలయాల ఎగ్జిక్యూటివ్ అధికారులే ఆయా భూములను పరిశీలిస్తూ, కౌలుకు కేటాయిస్తూ, భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సి ఉంటుంది. అయితే దేవాదాయశాఖలో ఈవోల కొరత ఉండడం, ఒక్కో ఈవో నాలుగైదు ఆలయాలకు అధికారిగా వ్యవహరిస్తుండడంతో వారు భూముల సంరక్షణపై దృష్టి సారించలేకపోతున్నారు. దీనికితోడు రాజకీయ పలుకుబడి గలిగినవారు, కబ్జాదారులకు అండగా నిలుస్తుండడంతో దేవాలయాల భూముల కబ్జాలు యథేచ్ఛగా కొనసాగాయని చెప్పవచ్చు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ రికార్డుల పరంగా 14,769 ఎకరాల దేవాదాయ భూములుంటే అధికారికంగానే 2,708 ఎకరాల భూమి కబ్జాకు గురైందని నిర్ధారించగా, అనధికారికంగా అది సుమారు 5వేల ఎకరాల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దశాబ్దాలుగా భూములు కౌలుకు తీసుకుంటున్న రైతులే కబ్జాలకు పాల్పడితే, కొన్ని దేవాలయాల పరిధిలో ఆలయాల నిర్వాహకులు, ధర్మకర్తలు, దేవస్థాన అర్చకులు సైతం ఆక్రమణలకు తోడ్పాడునందిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నాకే దేవాలయ భూములను సర్వేచేసి హద్దురాళ్లు నిర్ణయించడంతో పాటు....

- మిగతా 7వ పేజీలో...

సర్వే తర్వాత భూముల స్వాధీనం

రెవెన్యూ, దేవాదాయ శాఖలు సంయుక్తంగా ఈసర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైన చోట అటవీ, నీటిపారుదలశాఖ అధికారులకు కూడా సర్వేపై నోటీసులిస్తారు. దేవాదాయ శాఖ భూముల రికార్డుల ఆధారంగా రెవెన్యూశాఖతో కలిసి ఈ సర్వే చేపడతారు. రికార్డుల్లో ఉన్న ప్రకారం సర్వే నిర్వహించి హద్దురాళ్లు నిర్ణయిస్తారు. ఈక్రమంలో ఆక్రమణలుంటే బయటకు వస్తాయి. దేవాదాయశాఖ పరిధిలో కాకుండా ఆక్రమణదారుల పరిధిలో ఈ భూములుంటే వాటిని ఎంతమేర ఆక్రమించారనే అంశాన్ని గుర్తించి ఆక్రమణల నుంచి వెళ్లాల్సిందిగా నోటీసులందిస్తారని తెలిపారు. అనంతరం అవసరమైతే ఆక్రమణదారులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి భూములు స్వాధీనం చేసుకుంటారని చెబుతున్నారు. భూముల స్వాధీనంతోపాటు భూములన్నింటికీ హద్దులు నిర్ణయిస్తారు. అనంతరం భూముల స్వభావం, వనరుల ఆధారంగా కౌలు నిర్వహించి ఆదాయాన్ని సృష్టించేలా స్పష్టమైన ఆదేశాలను దేవాదాయశాఖ ద్వారా అమల్లోకి తేవాలని భావిస్తున్నారు.

ప్రైవేట్ ఏజన్సీల ద్వారా జీడీపీఎస్ సర్వేకు సన్నాహాలు

దేవాదాయ భూములను గుర్తించేందుకు జీడీపీఎస్ (గ్లోబల్ డిఫరెన్షియల్ పొజిషన్ సర్వే) చేపట్టాలని ప్రాథమికంగా నిర్వహించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లతో ఇటీవల జరిగిన సమావేశంలో ఈమేరకు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. అన్యాక్రాంతమైన భూములతోపాటు, దేవాదాయ శాఖకు సంబంధించి మొత్తం భూములను సర్వే చేయాలని నిర్ణయించారు. ముందుగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈసర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏదైనా ఒక జిల్లాను పైలెట్‌గా ఎంపికచేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈసర్వే సందర్భంగా వెలుగులోకి వచ్చే సమస్యలను అధిగమించేలా మార్గదర్శకాలు రూపొందించి పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల్లో మొత్తం దేవాదాయశాఖ భూములన్నింటినీ సర్వే చేయాలని నిర్ణయించారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవు

- వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్



ఏరియా ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న అజయ్‌కుమార్

మిర్యాలగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరైతే వైద్యులపై చర్యలు తప్పవని వైద్యారోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. పలువార్డుల్లో పర్యటించి చికిత్స విధానాన్ని, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. వైద్యులకు, స్టాఫ్ నర్సులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందిసున్న వైద్యసేవలపై విజిలెన్స్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించాల్సిన సమయంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించిన మరుక్షణం సొంత ఆసుపత్రుల అనుమతులు రద్దు చేస్తామన్నారు. అలాంటి డాక్టర్లపై కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఆసుపత్రిలో త్వరలో బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య తగ్గడంపై గైనకాలజిస్టులను వివరణ కోరారు. ఆసుపత్రిలో జరిగిన ప్రసవాల్లో 70శాతం సిజేరియన్ ఆపరేషన్లు చేయడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. సాధ్యమైనంత మేరకు సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. రాత్రి సమయాల్లో ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా గైనకాలజిస్టులు అందుబాటులో ఉండాలన్నారు. కాన్పుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయన వెంట జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి మాతృనాయక్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరథ్, ఆర్‌ఎంవో రాంబాబు ఉన్నారు.

సమస్యలుంటే వెంటనే తెలియ జేయాలి

ఎస్పీ శరత్‌చంద్రపవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది, అధికారులకు వ్యక్తిగత, మానసిక, శాఖాపరమైన సమస్యలుంటే వెంటనే తెలియజేయాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు ఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో మానసిక నిపుణుడు అశోక్ కుమార్‌తో పోలీస్‌సిబ్బందికి మానసిక, ఆరోగ్య అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ మానసిక ఒత్తిళ్లు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరికి ఉద్యోగం చాలా ముఖ్యమన్నారు. అన్ని ఉద్యోగాల్లో పోలీస్ ఉద్యోగం బాధ్యతాయుతమైందని, ఈ ఉద్యోగంలో అనేక సమస్యలు ఎదురవుతాయని, వాటి పరిష్కారం దిశగా ఆలోచించాలి తప్ప మానసిక వేదనకు గురి కావొద్దన్నారు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుందని, సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, సూరప్పనాయుడు, శ్రీనివాస్, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేర నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

- నల్లగొండలో భారీ కార్డెన్ సెర్చ్



6

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



కనగల్ భవిత కేంద్రంలోని విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

కనగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా బోధించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శుక్రవారం కనగల్ ప్రాథమిక పాఠశాలలోని భవితకేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాప్రగతిని అంచనా వేశారు. విద్యార్థుల అవసరాలకనుగుణంగా బోధన చేయాలన్నారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టేలా చూడాలన్నారు. భవిత సెంటర్ సొంత గది నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. సాధారణ పిల్లల మాదిరిగానే మానసిక శారీరక ప్రత్యేక అవసరాలున్న పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. మండలంలోని రాంచంద్రాపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం రికార్డులను పరిశీలించారు. కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాంటా వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. లారీల కొరత ఉంటే, అదనపు లారీలను కేటాయించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో అశోక్‌రెడ్డి, సివిల్‌సప్లయి మేనేజర్ హరీష్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో భిక్షపతి, తహసీల్దార్ బి.పద్మ, ఎంఈవో పద్మ,ఆర్‌ఐ సునీత,హెచ్‌ఎం సునీత పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



గుండ్రాంపల్లిలో జెండావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిట్యాలరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జిల్లా ఎమ్మెల్సీ సత్యం ఆరోపించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేద, సామాన్య ప్రజలు నిత్యం వాడే నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం, పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నులు వసూలు చేస్తూ మోదీ ప్రజావ్యతిరేక విధానాలను పాల్పడుతున్నారన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవన్నారు. కేంద్రంలో అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దారాధత్తం చేస్తుందని, కార్పొరేట్‌లకు రెడ్‌కార్పెట్ వేస్తే ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేయడం మోదీకే చెల్లిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబాని, ఆదానీలకు కట్టబెడుతూ ప్రైవేట్‌పరం చేయడం దేశానికి నష్టం జరగడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లా సహాయకార్యదర్శి లొడంగి శ్రవణ్ మాట్లాడుతూ ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మహాసభలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కెరుమిద్దె శ్రీనివాస్, మండల సహాయకార్యదర్శి జిల్లా సత్యం, గీతపనివారల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, జిల్లా యాదయ్య, ఎస్కే షరీఫ్, సీమ అంజయ్య, కేతరాజు అంజయ్య, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, జిల్లా లక్ష్మయ్య, దేవేందర్, శేఖర్, బక్కశెట్టిచ శివ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

దేవరకొండ: ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని అంక్షలు విధించకుండా వేగవంతంగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి కోరారు. దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడిచే ప్రమాదం ఉందని, వేగవంతంగా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి దేవేందర్ రెడ్డి, దేప సుదర్శన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కనకచారి, వెంకటయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరల అదుపులో విఫలం

- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన

మిర్యాలగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశంలో నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయడంలో విఫలమవుతోందని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ మహిళా సమాఖ్య సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లతో కలిసి మాట్లాడారు. కేంద్రం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలను నిర్వహిస్తూ ప్రపంచ సుందరీమణులకు తెలంగాణ వంటకాలు, సంప్రదాయాలను, చారిత్రక ప్రదేశాలను చూపుతూ రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటడం బాగుందన్నారు. కానీ తెలంగాణ ఆడపడుచుల మనోభావాలు దెబ్బతినే విధంగా వరంగల్‌లో సుందరీమణుల కాళ్లు కడిగించడం ఎంత వరకు సమంజసమన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, ఎస్కే షమీం, శాంతి, సీపీఐ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్ కుమార్, ఎర్ర ప్రమీల, పోలేపల్లి మమత, లింగంపల్లి సైదమ్మ, కోటమ్మ, శైలజ, సైదమ్మ, రజియా, సుశీల, సీత, పద్మ పాల్గొన్నారు.

నర్సరీల్లో ఏడు రకాల మొక్కలు పెంచాలి

డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

నిడమనూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నర్సరీల్లో ఏడు రకాల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొక్కమంతలపహాడ్ గ్రామంలోని నర్సరీని శుక్రవారం ఆయన పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది మండలంలో 58 వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు స్వచ్ఛభారత్ మిషన్ పథకం కింద మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బోనగిరి రమేష్, ఏపీవో కంచుకట్ల శ్రీనివాస్, ఎంపీవో కేదార్‌నాథ్, ఏపీడీ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు లింగయ్య, శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ, మధు, నర్సింహాచారి, బాలాజీనాయక్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి

జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్

హాలియా, మే 16(ఆంధ్రజ్యోతి): పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని, లేదంటే సంబంధిత డీలర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. అనుముల మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల స్టాక్ బోర్డు, ధరల పట్టిక, లైసెన్సులను పరిశీలించి విత్తనాల విక్రయానికి సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సరిత, వ్యవసాయ సిబ్బంది, డీలర్లు తదితరులు ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ త్వరలోనే పాస్‌పుస్తకాలు

- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, పక్కన జాయింట్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

తిరుమలగిరి(సాగర్), మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు తుది అంకానికి చేరుకుందని, త్వరలోనే మండలంలోని అర్హులైన రైతులందరికీ పాస్‌పుస్తకాలను అందించనున్నట్లు మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎఫ్‌వో రాజశేఖర్‌తో కలిసి శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నెల్లికల్లు గ్రామంలో పలువురు రైతులు మాట్లాడుతూ తమకు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చారని చెప్పారు. అయితే ఇటీవల పైలట్‌ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన సర్వేలో తమ భూములకు సంబంధించిన వివరాలు లేవని, తిరిగి తమ భూములను సర్వే చేయించేలా చూడాలని జానారెడ్డి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు విన్నవించారు. ఈక్రమంలో పేద రైతులను దృష్టిలో పెట్టుకొని తిరిగి కాస్తు కబ్జాలో ఉన్న రైతులను నిర్ధారించేందుకు సర్వే నిర్వహించేలా చూడాలని జానారెడ్డి అధికారులకు సూచించారు. నెల్లికల్లు లిఫ్ట్ పనులను వేగవంతం చేయడంతోపాటు ఈ ప్రాంతం రైతుల భూములకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులను చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రాజవరం గ్రామంలో గతంలో పేదలకు పంపిణీ చేసేందుకు సేకరించిన భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. తాను హోంమంత్రిగా పనిచేసిన కాలంలో రాజవరం, బోయగూడెం, కొంపల్లి, చిలకాపురం గ్రామాల్లో పేదలకు పంపిణీ చేసేందుకు భూములను సేకరించినట్లు త్వరలోనే ఆయా గ్రామాల్లో అర్హులైన పేదలు ఇళ్లు కట్టుకునేందుకు పట్టాలను అందజేసేలా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, అధికారులు కృషి చేస్తారన్నారు. ఆయనవెంట జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ కర్నాటి లింగారెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సుజాత, తహసీల్దార్ అనిల్, హాలియా మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్, యడవెల్లి వల్లభరెడ్డి, ఆర్‌ఐ లక్ష్మీకాంత్, మైసయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

యువతి ఆత్మహత్య కారకుడికి 12 ఏళ్ల జైలు

నల్లగొండ టౌన్ / కనగల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : యువతిని ప్రేమించమని వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడికి 12 ఏళ్ల 6 నెలల జైలుశిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా మూడవ అదనపు కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. కోర్టు కనగల్ పోలీస్ కానిస్టేబుల్ వై.నగేష్ తెలిపిన వివరాల ప్రకారం కనగల్ మండలం కనగల్ మండలం జీ.చెన్నారం గ్రామానికి చెందిన బొల్లం శ్రవణ్ ఇదే మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని, ఆమె ఫోన్‌నెంబరుకు అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టి ప్రేమించకపోతే చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. 2023 ఆగస్టు 9న శ్రవణ్ మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో యువతి ఇంటికి వెళ్లి లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పారిపోతుండగా యువతి తండ్రి, స్థానికులు అతడిని మందలించారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపం చెందిన యువతి అదేరోజు సాయంత్రం ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో జిల్లా ఫ్యామిలీ కోర్టు సెషన్ జడ్జి దుర్గాప్రసాద్ శుక్రవారం 12 ఏళ్ల 6 నెలల జైలుశిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించారు. కేసును త్వరగా ఇన్వెస్టిగేషన్ చేసి సరైన ఆధారాలను సమర్పించి, నేరస్తుడికి శిక్షపడేలా కృషిచేసిన అప్పటి దర్యాప్తు అధికారులు సీఐ ఏ వెంకటయ్య, ఎస్ఐ ఎన్ అంతిరెడ్డి, ప్రస్తుత సీఐ కే ఆదిరెడ్డి, ఎస్ఐ విష్ణుమూర్తి, అదనపు పీపీ జవహర్‌లాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ వై.నగేష్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ పీ నరేందర్, ఎన్ మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

కుటుంబ కలహాలతో ఆర్ఎంపీ ఆత్మహత్య



ఆదినారాయణ(ఫైల్‌ఫొటో)

నూతనకల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఆర్ఎంపీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగంపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది ఆదినారాయణ(35) ఆర్ఎంపీగా సేవలందిస్తున్నాడు. కుటుంబ కలహాలతో కొన్నిరోజులుగా భార్య, కుమార్తెతో కలిసి తల్లి గారింటికి వెళ్లింది. తన కుమారుడితో కలిసి ఇంట్లో నిద్రించాడు. తెల్లవారుజామున వంట గదిలో ఉరివేసుకున్నాడు. ఉదయం గ్రామానికి చెందిన కొంతమంది రోగులు వైద్యం కోసం ఇంటికి వచ్చి తలుపు తట్టడంతో వారి కుమారుడు నిద్ర లేచి, పక్కన తండ్రి లేకపోవడంతో వంట గదిలోకి వెళ్లి చూడడంతో ఉరివేసుకుని కనిపించాడు. కుమారుడు ఏడ్చుకుంటూ ఇంటికి వైద్యానికి వచ్చిన వారికి చెప్పడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తికి తరలించారు. ఆదినారాయణ తండ్రి రామకృష్ణ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదినారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో ఎళ్లవేళ్లలా అందుబాటులో ఉండే ఆర్ఎంపీ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అడ్డొస్తున్నాడనే ప్రియుడితో కలిసి భర్త హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, వెనక ముసుగులో నిందితులు

వలిగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం భీమలింగం కాల్వ వద్ద లభించిన మృతుడి హత్య మిస్టరీ వీడింది. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి పట్టణ సింగన్నగూడెం ప్రాంతానికి చెందిన బేరు సురేష్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య మంగ కూడా కూలీ పనులకు వెళ్తుంటుంది. గౌస్‌నగర్‌కు చెందిన పల్లెర్ల స్వామితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంలో భర్త మందలిస్తుండటంతో అతడిని అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నెల 14న ఇంట్లోనే ప్రియుడు స్వామితో కలిసి మంగ హత్య చేసింది. అనంతరం మృతదేహాన్ని వలిగొండ మండలం సంగెం పరిధి భీమలింగం వంతెన కింద పడవేసి వెళ్లిపోయారు. పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం భార్య మంగ ప్రియుడు స్వామితో కలిసి హత్య చేసినట్లు గుర్తించారు. సదరు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి భువనగిరి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు త్వరగా ఛేదించిన ఎస్ఐ యుగేందర్‌గౌడ్, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ దొంగ అరెస్టు

నేరేడుచర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావులు, బోర్ల వద్ద విద్యుత్ మోటార్ల వైర్లను చోరీచేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన పస్తం అశోక్ అలియాస్ అనిల్‌కుమార్ నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలోని రామాపురంలో ఈ నెల 13న రాత్రి సుమారు రూ.20వేల విలువైన 10 వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్‌ను చోరీ చేశాడు. ఈ నెల 15న మోటార్ సైకిల్‌పై కేబుల్ వైర్లను విక్రయించడానికి మిర్యాలగూడ వెళ్తున్నాడు. మండలంలోని చిల్లేపల్లి వద్ద తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన అశోక్‌ను ఆపి పరిశీలించగా అతడి వద్ద విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు కనిపించాయని తెలిపారు. దీంతో కేబుల్ వైర్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పు తెస్తోన్న ముప్పు



● సగటు జీవికి తప్పని అగచాట్లు!!

పల్లె, పట్నం తేడా లేదు, ఎక్కడా అప్పు పుట్టడంలేదు. చేబదులూ అందడం లేదు. అవసరానికి డబ్బు సర్దుబాటు కానీ పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల ఇబ్బందులు వర్ణనాతీతం. ఎవరిని కదిలించినా డబ్బు సమస్య కనిపిస్తోంది. గతంలో డబ్బులు అవసరం ఉందంటే ఎవరో ఒక రు సర్దుబాటు చేసే వారు. బంధువులు, స్నేహితు లు చేబదులు ఇచ్చేవారు లేదంటే అప్పు అయినా పుట్టేది. వాటితో అవసరాలు తీర్చుకొని, డబ్బులు సర్దుబాటు కాగానే తిరిగి చెల్లించేవారు. ఫైనాన్స్ నిర్వాహకులు, వడ్డీ వ్యాపారులు, నమ్మకం ఉన్నవారికి అప్పులు ఇచ్చేవారు. అయితే ఇచ్చిన అప్పులు తిరిగి తీసుకునేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. దీనికితోడు మార్కెట్ లేకపోవడం, అప్పు తిరిగి చెల్లించేందుకు జాప్యం నెలకొనడంతో అప్పు పుట్టడం లేదేమోనని సామాజిక వేత్తలు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

ఆరుగాలం సాగులో శ్రమించే రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. సాగుకు పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గి కష్టానికి తగిన ఫలితం రాక తీవ్ర నిరాశలో రైతులు ఉన్నారు. స్వయం ఉపాధి, కులవృత్తులను నమ్ముకుని, చిరువ్యాపారులు కుటుంబాలు సాకుతున్న వారంతా వ్యాపారాల్లో పోటీ పెరిగి ఆదాయం తగ్గడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దె, ఇతర అవసరాలు తీర్చుకోవడం పెనుభారంగా మారింది. రోజు వారి కూలీల పరిస్థితి ఎంత కష్టించినా పొట్టాబట్టకు అన్నట్లు ఉండటంతో పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఇలా ప్రతీపనికి అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

కొందరి తీరు... అందరికి శాపం..

అప్పు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారం పూర్తిగా చతికిలపడింది. వడ్డీ వ్యాపారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోవడం, డబ్బుల కోసం నిలదీసే పరిస్థితి లేకపోవడంతో వడ్డీ వ్యాపారులు ఎక్కువ శాతం దెబ్బతిన్నారు. పోలీసులు అప్పు ఇచ్చిన వారిని ఇబ్బందుల పాలు చేసిన ఘటనలతో వడ్డీ వ్యాపారులు ఆ వ్యాపారాలను వదిలేశారు. ఇచ్చిన డబ్బులు రాక వడ్డీ వ్యాపారులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వడ్డీ వ్యాపారం పరిస్థితి కూడా అధ్వానస్థితికి చేరింది. దీంతో కొందరి తీరు నిజాయితీ పరులకు కూడా అప్పుపుట్టని పరిస్థితి తీసుకువచ్చింది. ఇదిలా ఉండగా అప్పు ఇచ్చి, పుచ్చుకునే సమయంలో మధ్య వర్తులుగా ఉన్న వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇద్దరి మధ్య నలిగిపోతున్నారు. అవసరం మేరకు తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో స్నేహితులు, బంధువుల మధ్య గొడవలు దారితీస్తున్నాయి. అవి కాస్తా బంధాలు తెగిపోయేలా చేస్తున్నాయి.

మోసాలు తెస్తున్న తంటా..

నమ్మించి మోసం చేస్తున్న పలువురి తీరుతో సామాన్యులకు అప్పు పుట్టని పరిస్థితులు దాపురించాయి. నిజాయితీగా కడదామన్నా, అత్యవసరమైనా అప్పు పుట్టడం లేదు. యాదాద్రిభువనగిరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 50 మంది ఇతర రాష్ట్రాల వ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేసుకుని కొన్నేళ్ల పాటు స్థానికులతో సత్సంబంధాలు ఏర్పాటుచేసుకుంటోన్నారు. నమ్మించి రూ.కోట్లు అప్పుల తీసుకోవడం, తాకట్టు పెట్టుకుని డబ్బులు ఇవ్వడం, ఎక్కువ వడ్డీలిస్తామని డబ్బులు తీసుకుని ఆ తర్వాత ఉడాయించారు. ఇలాంటి ఘటనలు అప్పు ఇస్తే తిరిగి రావని, ఇక నుంచి అప్పులు ఎవరికీ ఇవ్వవద్దని చాలామంది నిర్ణయానికొస్తున్నారు. దీంతో అప్పు పుట్టకుండాపోతోంది.

కాంట్రాక్టర్ల లబోదిబో..

ప్రభుత్వ పనులు చేసి డబ్బు సంపాదించాలనుకున్న నాయకులు కొందరు, సర్పంచ్, ఎంపీటీసీలు చేయకూడని అప్పులు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. పనులుపూర్తయి ఏళ్లు గడుస్తున్నా బిల్లు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో తాజా మాజీ ప్రజా ప్రతినిధుల్లో సర్పంచ్‌లు ఎక్కువ మంది రూ.15 నుంచి రూ.60 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. అప్పులిచ్చిన వారు నిలదీస్తుండటంతో వారి భూములను విక్రయించి అప్పు చెల్లించిన దాఖలాలూ ఉన్నాయి. ప్రభుత్వ కాంట్రాక్టు పనులతో లాభాలు రాకపోగా కనీసం పెట్టుబడి డబ్బులు సకాలంలో రాక భూములు పోగొట్టుకుని ఆందోళన చెందుతున్నారు.

ప్రాణాల మీదకు తెస్తున్న అప్పులు

ఐదేళ్ల కిందట యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్దసంఖ్యలో భూములు కొనుగోలు చేయడానికి రూ.కోట్లు అప్పు చేశాడు. ఆకస్మికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలుకావడంతో పూర్తిగా రియల్టర్ పరిస్థితి తలకిందులైంది. భూములకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అప్పులు ఇచ్చిన వాళ్లు డబ్బులు కోసం తీవ్రంగా ఒత్తిడితెచ్చారు. ఏళ్లు గడుస్తున్నా రియల్టర్ డబ్బులు ఇవ్వడంలేదని రియల్టర్‌ను హత్యచేసినట్లు ఆరోపణలు సైతం వచ్చాయి.

తాకట్టే ఆధారం..



ఒకప్పుడు మాట మీద డబ్బులు వడ్డీకి ఇచ్చేవారు. బ్యాండ్ పేపర్, ఇతరత్రా కాగితాల మీదనే నమ్మకంతో వడ్డీ వ్యాపారం కొనసాగేది. ఇప్పుడు మార్కెట్ పరిస్థితులు, కొందరు తీరు సరిగా లేకపోవడంతో వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అప్పు ఇవ్వాలంటే ప్లాట్, భూములు, బంగారం తాకట్టు పెడితే గాని అప్పు పుట్టడం లేదు. అప్పు ఇచ్చే వారి పేరు మీద భూమి, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించడం, బ్యాంకుల్లో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టడం ద్వారానో అప్పులు తీసుకుంటున్నారు. తాకట్టు లేనిదే అప్పు దొరకని పరిస్థితి. బ్యాంకుల్లో ప్రతి రోజూ గోల్డ్‌లోన్ కోసం 20 మంది వరకు అప్పులు తీసుకుంటున్న అధికారులు తెలిపారు.

భూములున్నా... రాని భరోసా

భూక్రయవిక్రయాలతో ఎక్కువ లాభాలు గడించవచ్చన్న నమ్మకంతో సామాన్యులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ భూములు కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగం బాగా నడుస్తుందని, శ్రమ లేకుండా త్వరగా ధనవంతులు కావచ్చన్న ఆలోచనతో అప్పులు చేసి అడ్డగోలుగా భూములు కొనిపెట్టుకున్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్‌వ్యాపారం కుప్పకూలింది. రెండేళ్లుగా సరిగ్గా వ్యాపారంలో వృద్ధి లేకపోగా, కొనుగోళ్లు నిలిచి వారి ఆర్థిక పరిస్థితి ఆందోళకరంగామారింది. అప్పులిచ్చిన వారి



వేధింపులతో వారి పరిస్థితి మునిగిపోయే నావాలా మారింది. కోట్లు పెట్టి ఇళ్ల నిర్మాణాలు చేస్తే అవి ప్రస్తుతం విక్రయం కాక అప్పులకు వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు.

నేర నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

● నల్లగొండలో భారీ కార్డెన్ సెర్చ్



కార్డెన్‌సెర్చ్‌లో అదుపులో తీసుకున్న అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నేరనియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్ చేపట్టామని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. అనుమానిత వ్యక్తుల సమాచారం సమీప పోలీస్‌స్టేషన్‌కు అందించాలని ఆయన సూచించారు. కమ్యూనిటీ కాంటాక్టులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాన్యంచెల్కలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. డీఎస్పీ, 8 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలతో పాటు 320 మంది పోలీసులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సరైనపత్రాలు లేని 165 వాహనాలు, నాలుగు ఆటోలు, గంజా చాక్లెట్స్ రెండు హుక్కా పార్ట్, ఒక ఎయిర్‌గన్ సీజ్ చేశారు. ఎక్కువగా జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన 150మంది అనుమానితులను గుర్తించారు. అలాగే నలుగురు రౌడీషీటర్స్‌ను అదుపులో తీసుకోగా వీరిలో ఒకరి వద్ద నుంచి ఎయిర్‌గన్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 30 మందిని గంజాయి టెస్ట్ నిర్వహించగా ఎనిమిదిమంది తాగినట్లు నివేదిక వచ్చింది. వీరు ఎక్కడి నుంచి కొనుగోలు చేసి తాగారనే దానిపైన విచారణ చేపడుతున్నారు. కార్డెన్‌సెర్చ్ అనంతరం ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా పట్టణంలో కార్డెన్ సెర్చ్ చేపట్టామన్నారు. కాలనీల్లో, ఇంటి ప్రదేశాల్లో అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ఇళ్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. నేరరహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు శాంతిభద్రతలు కల్పించాలని, గంజాయి తదితర మాదకద్రవాలను నిలువరించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. గంజాయిని అరికట్టేందుకు మూడు దశల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్‌రెడ్డి, నాగరాజు, రాజశేఖర్, సీఐ మహాలక్ష్మయ్య, కరుణాకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో పల్టీ ఒకరి మృతి, మరొకరికి గాయాలు



ప్రవీణ్(ఫైల్‌ఫొటో), అంతిమయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య, పాడె మోస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు

యాదగిరిగుట్ట రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లిలో ఆటో పల్టీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన సదా ప్రవీణ్(36), ఊట్కూరి రాజుగౌడ్‌లు రాజుగౌడ్ ఆటోలో గురువారం వ్యక్తిగత పనిమీద గౌరాయిపల్లికి వెళ్లి రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. గౌరాయిపల్లి గ్రామ సమీపంలోని దర్గమ్మగుడి మలుపు వద్ద కల్వర్టును ఆటో ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా, రాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రవీణ్‌కు భార్య, తల్లి ఉన్నారు. సోదరుడు ప్రసాద్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రవీణ్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతం జరిగిన ప్రవీణ్ అంతిమయాత్రలో పాల్గొన్నాడు.

పాడె మోసిన డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రవీణ్ మృతదేహంపై డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రవీణ్ అంత్యక్రియల్లో పాడె మోశారు. ప్రవీణ్ మృతిని జీర్ణించుకోలేక పోతున్నామని ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయనతో పాటుగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి, సైతం పాడె మోశారు. ఇదిలా ఉండగా ప్రవీణ్ మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రవీణ్ మృతదేహంపై పడి తల్లి, భార్య రోదించిన తీరు అందరినీ కంటతడిపెట్టించింది. అందరితో కలివిడిగా ఉండే ప్రవీణ్ మృతిని స్నేహితులు, సన్నిహితులు జీర్ణించుకోలేకపోతున్నారు.

లారీని కారు ఢీకొని ఏపీ వాసి ...



తోకల రవి మృతదేహం

చిట్యాల రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి వద్ద హైదరాబాద్-విజయవాడ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ట్రైనీ ఎస్ఐ అఫ్రీన్ నసీహ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగేడ గ్రామానికి చెందిన తోకల రవి(45) అతడి తల్లి తోకల నాగమ్మ, కారులో డ్రైవర్ పోల్‌సాగర్‌తో కలిసి హైదరాబాద్‌లో ఉండే రవి సోదరుడు శ్రీనివాస్‌ను కలిసేందుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరి మండలంలోని వట్టిమర్తి శివారులోని డూన్ పంజాబీదాబా సమీపంలోకి రాగానే దాబా నుంచి రహదారి మీదకు లారీ నిర్లక్ష్యంగా ఒక్కసారిగా రావడంతో కారు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు కూర్చున్న తోకల రవికి తీవ్రగాయాలై అపస్మారక స్థితిలో వెళ్లాడు. రవిని చికిత్సనిమిత్తం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి నాగమ్మ, డ్రైవరు పోల్‌సాగర్‌కు గాయాలు కాలేదు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి శవపరీక్షకై నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. రవి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు డివైడర్‌ను ఢీకొని

మునగాల, మే 16 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కారు డివైడర్‌కు ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా శుక్రవారం తెల్లవారుజామున మునగాల మండలకేంద్రం బరాఖత్‌గూడెం సమీపంలో జరిగింది. ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌ఖలీక్(25), అతడి స్నేహితులు మహ్మద్ కైసర్‌అలీ, అబ్దుల్లా అంజాద్ కలసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు మేకలను కొనుగోలు చేసేందుకు వెళ్తున్నారు. కారును డ్రైవర్ మహ్మద్ యాసిన్‌ఖాన్ నడుపుతున్నారు. కొంతదూరం వెళ్లాక తాను నడుపుతానని మహ్మద్ అబ్దుల్‌ఖలీక్ తీసుకున్నాడు. అతివేగంగా నడపటంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని హైదరాబాద్ వెళ్లే రోడ్డు మీద కారు బోల్తా పడింది. ఈ ఘటనలో అబ్దుల్‌ఖలీక్‌కు తీవ్రగాయాలు కాగా 108వాహనంలో కోదాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. కళ్ల ముందు స్నేహితుడు మృతి చెందడంతో కన్నీరుపెట్టారు. కారు బోల్తా పడిన సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు రాకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

జనగామ జిల్లాలో యాదాద్రి జిల్లా వాసి...

రఘునాథపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. యదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగుకు చెందిన బర్ల రాజు(39) నిడిగొండలో హోటల్ నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నాడు. రాజు తన బైక్‌పై హోటల్‌కు వస్తున్న క్రమంలో హన్మకొండ నుంచి జనగామ వైపు వెళ్తున్న కారు, మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై రాజుకు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జనగామ మార్చురీకి తరలించారు.

తుంగతుర్తి కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

● ఉద్రిక్తతలకు దారితీసిన సమావేశాలు

తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాటలు మరోసారి బహిర్గతమయ్యాయి. శుక్రవారం అర్వపల్లి, మోత్కూరులో నిర్వహించిన పార్టీ సమావేశాలు పార్టీలో వర్గవిభేధాలకు, ఘర్షణకు వేదికగా నిలిచాయి. వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడంతో పాటు కుర్చీలు విసిరివేత, నెట్టువేతలకు దిగారు. అర్వపల్లిలో పోలీసుల జోక్యం చేసుకుని ఇరువర్గాలను పంపించి వేయగా, కార్యక్రమం రద్దయ్యింది.

(ఆంధ్రజ్యోతి-అర్వపల్లి/ మోత్కూరు)

సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ముదిరింది. నిన్న నిలదీతల వరకే పరిమితం కాగా నేడు తోపులాట, కుర్చీల విసిరివేసే వరకు వెళ్లింది. ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్గాలుగా విడిపోయి ఘర్షణకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం పార్టీలోని బ్లాక్, మండల, గ్రామస్థాయి కమిటీల పదవులకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ఇరువర్గాల ఘర్షణతో ఉద్రిక్తతకు దారితీసి చివరకు రద్దయ్యింది. ముఖ్యనాయకులు అక్కడకు రాకుండానే సమావేశాన్ని రద్దు చేశారు. అర్వపల్లిలోని లక్ష్మీఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పార్టీ మండల అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు, గ్రామకమిటీ అధ్యక్షుల పదవులకు దరఖాస్తులను స్వీకరించడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రాక ముందే ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. కుర్చీలు విసిరేసుకొని, తోపులాట జరుగుతుండగా పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. సుమారు రెండు గంటల పాటు వాగ్వాదం చేసుకున్నారు. అయితే తోపులాట జరిగినప్పుడు దామోదర్‌రెడ్డి వర్గాన్ని పోలీసులు గేట్లు వేసి లోపలే ఉంచారు. ఎమ్మెల్యే వర్గాన్ని లోపలికి వెళ్లనీయకుండా రోడ్డుపైనే ఉంచారు. కొద్దిసేపటికి ఇరువర్గాలను పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు. దీంతో కార్యక్రమం రద్దయ్యింది. ఇదిలా ఉండగా రెండురోజుల కిందటే సూర్యాపేటల పార్టీ పదవుల కోసం దరఖాస్తుల కూడా ముగిసింది. అయితే కావాలనే ఇక్కడ మరోసారి దరఖాస్తుల స్వీకరణను ఏర్పాటు చేశారు. అయితే గందరగోళం నెలకొని ఉద్రిక్తతకు దారితీసింది. ఇదిలా ఉండగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ సమన్వయం పాటించాలని, పదవులు ఎవరికి వచ్చినా ఓపికతో కాంగ్రెస్ పార్టీకి పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.

చొక్కాలు పట్టుకుని...



ఘర్షణ జరుగుతుండటంతో అర్వపల్లిలో ఫంక్షన్‌హాల్ బయట కార్యకర్తలు

తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో భాగంగా శుక్రవారం మోత్కూరు మండలం పాటిమట్ల క్రాస్‌రోడ్డులో ఉన్న ఫంక్షన్‌హాల్లో మోత్కూరు, అడ్డగుడూరు మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశం ముఖ్య ఉద్దేశాన్ని కాంగ్రెస్ పార్టీ యాదాద్రిభువనగిరి జిల్లా పరిశీలకుడు ఫులి అనిల్‌కుమార్ వివరించిన తర్వాత స్థానిక నాయకులు మాట్లాడటానికి అవకాశమిచ్చారు. అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచ్ నారగోని అంజయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఎన్నికల్లో తాను డబ్బులు ఖర్చు పెట్టుకుని గెలిపించానని, ఇప్పుడు ఆయన తనను గాని, పాత కాంగ్రెస్ నాయకులనుగాని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆటుపోట్లను ఎదుర్కొన్న పాత కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను పట్టించుకోకుండా, ఆయన గెలిచిన తర్వాత బీఆర్ఎస్ నుంచి కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సీపీఐ నాయకులతో అంటకాగుతున్నారంటూ విమర్శలు గుప్పిసుండగా బాలెంల సైదులుతో పాటు మరికొందరు నాయకులు ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయవద్దంటూ ఆయనకు అడ్డుతగిలారు. ఎమ్మెల్యే పనితీరు బాగానే ఉందని, కొందరు కావాలని ఎమ్మెల్యేను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ప్రతివిమర్శలు చేశారు. ఎమ్మెల్యే వ్యతిరేక, అనుకూల వర్గాలు నువ్వేం చేశావంటే, నువ్వేం చేశావని వాదించుకుంటూ చొక్కాలు పట్టుకుని పరస్పరం నెట్టేసుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకున్నారు. కుర్చీలు లేపి విసురుకోవడానికి ప్రయత్నించారు. ఇరువర్గాల మధ్య కుస్తీపట్లు పెరగడంతో జిల్లా పరిశీలకుడు అనిల్, జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మరికొందరు జోక్యం చేసుకుని ఇరువర్గాలను విడదీసి సముదాయించారు. ఆ తర్వాత మళ్లీ సమావేశం యథావిదిగా కొనసాగింది. నియోజకవర్గ, మండల కోఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటుచేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఏడాదంతా తానే పరిశీలకుడిగా ఉంటానని, గ్రామాలకు వచ్చి సమావేశాలు నిర్వహిస్తానని, పార్టీకోసం పని చేసే ఏ కార్యకర్తకు అన్యాయం జరుగకుండా చూస్తానని పరిశీలకుడు అనిల్ హామీ ఇచ్చారు.

చెడు చెవిలో చెప్పండి..మంచి సభలో చెప్పండి

కార్యకర్తలు మాట్లాడేప్పుడు వ్యక్తిగత విమర్శలకు వెళ్లవద్దని, పార్టీకి సంబంధించిన విషయాలే ప్రస్తావించాలని, చెడు ఉంటే నా చెవిలో చెప్పండి, మంచి ఉంటే సభల్లో చెప్పండని కాంగ్రెస్ పార్టీ యాదాద్రిభువనగిరి జిల్లా జిల్లా పరిశీలకులు ఫులి అనిల్ కుమార్ అన్నారు. మోత్కూరు మండలం పాటిమట్ల క్రాస్‌రోడ్డులో లక్ష్మీనర్సింహఫంక్షన్ హాల్లో నిర్వహించిన మోత్కూరు, అడ్డగుడూరు మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం చేయడానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని, ఈ ఏడాది సంస్థాగత పటిష్ఠతే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యకర్తల మనో వేదనను తీర్చుతామన్నారు. నా చెవిలో చెప్పిన దాన్ని పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానన్నారు. 2017కు ముందు నుంచి పార్టీలో ఉన్నవారికే పదవులు ఇస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులను సంప్రదించి అన్నివర్గాల ప్రాతినిధ్యం ఉండేలా నియామకాలు చేపడుతామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, నిమ్మనగోటి జోజి, రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజీవి, పత్రెపాటి యుగంధర్, మార్కెట్ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, జి.జోసెఫ్, తండ సత్తయ్య,గుండగోని రామచంద్రు పాల్గొన్నారు.

బయోమైనింగ్ దిశగా అడుగులు

» మిర్యాలగూడలో తీరనున్న డంపింగ్ యార్డు కష్టాలు » చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువుల తయారీకి ప్రణాళిక

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపాలిటీలో చెత్త నుంచి సేంద్రీయ ఎరువుల తయారీకి అడుగులు పడుతున్నాయి. చెత్తను బయో మైనింగ్ ద్వారా శుద్ధి చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఈ వ్యర్థాలు వివిధ దశల్లో శుద్ధి అయ్యాక చివరగా వచ్చే బయో ఎర్త్‌ను. జీవ ఎరువుగా వినియోగించేందుకు మునిసిపాలిటీ రంగం సిద్ధం చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)



మిర్యాలగూడ శివారులోని ఈదులగూడ డంపింగ్ యార్డులో వెలువడుతున్న పొగ

వ్యాపార, వాణిజ్య, వైద్య, విద్యారంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చెందుతోన్న మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణంలో ఆవాసాల సంఖ్య 22,600లు ఉండగా కొత్త నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి. ఇక పట్టణ సమీపంలోని దామరచర్లలో 4వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే ఉత్పత్తి మొదలు కాగా ఆ ఎఫెక్టుతో పట్టణ జనాభా పెరగనుందని అంచనాలున్నాయి.

నిత్యం 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

మిర్యాలగూడ పట్టణంలోని ఇళ్ల, వ్యాపార కేంద్రాల నుంచి నిత్యం 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఆయా వ్యర్థాలను డంప్ చేసేందుకు రెండు దశాబ్దాల క్రితం ఈదులగూడలో ఆరున్నర ఎకరాల స్థలంలో యార్డు ఏర్పాటు చేశారు పురపాలకులు. అయితే పట్టణంలో పెద్దమొత్తంలో వెలువడుతున్న వ్యర్థాలను డంప్ చేసేందుకు ఆ స్థలం సరిపోకపోవడంతో సమస్యగా మారింది.ఈ నేపథ్యంలో అధికారులు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు

స్థానికుల నుంచి అభ్యంతరాలు

స్థల సమస్య అలా ఉండగా డంపింగ్ యార్డు నుంచి వెలువడే దుర్గంధం, పొగ కారణంగా ఈదులగూడ, రాంనగర్ బంధం, గూడూరు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. యార్డులో గుట్టలుగా ఉన్న వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో వెలువడుతున్న పొగ చుట్టుపక్కల కాలనీ వాసులను ఇబ్బందికి గురి చేస్తోంది. డంపింగ్ యార్డును మార్చాలంటూ ఆయా కాలనీల ప్రజలు పలుమార్లు మునిసిపల్ అధికారులకు వినతిపత్రాలు అందించడంతో పాటు ఖమ్మం రహదారిపై రాస్తారోకో నిర్వహించిన సందర్భాలున్నాయి.

బయోమైనింగ్ అమలుకు చర్యలు

పట్టణంలోని డంపింగ్ యార్డును ఇటీవల కలెక్టర్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జేడీ వేర్వేరుగా పరిశీలించి పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డులో బయోమైనింగ్ విధానం అమలు చేస్తే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావించిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. వీలైనంత త్వరగా బయోమైనింగ్ విధానం అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఉపయోగలివే..

పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి సేక రించిన చెత్తను నాలుగు దశలుగా విభజించి శుద్ధి చేస్తారు. చివరి అవుట్‌పుట్ 8 ఎంఎం కన్నా తక్కువగా ఉంటుంది. దీనిని బయోఎర్త్ అంటారు. పంట పొలాల్లో ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. ఆధునిక పద్ధతిలో డంపింగ్ యార్డు నిర్వహణనే బయోమైనింగ్ విధానమంటారు. ఈ విధానంలో వ్యర్థపదార్థాల నుంచి విలువైన లోహాలన ు సేకరించేందుకు సూక్ష్మజీవులను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియను రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీల్లో ఇప్పటికే అమ లు చేస్తున్నారు. ఆధునికమైన ఈ పద్ధతితో పర్యావరణానికి ఎలాంటి హాని కలగకపోగా దుమ్ము, ధూళి, పొగ వెలువడటం లాంటి ఇబ్బంది ఉండదు. ఇక సెగ్రిగేషన్ చేసే పనులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేయనున్నారు.


అతి త్వరలో బయోమైనింగ్ విధానం అమలు



డంపింగ్ యార్డులో అతిత్వరలో బయోమైనింగ్ విధానం అమలు కానుంది. ఆ విధానం అమలు చేసే ఏజెన్సీలతో కలెక్టర్, మునిసిపల్ జేడీ మాట్లాడారు. రెండు మూడు మునిసిపాలిటీలలో గుర్తించి ఏజెన్సీ సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఆధునిక విధానం అమలు జరిగితే నిర్వహణ సమస్యనేది ఉండదు. అయితే ప్రస్తుతం యార్డులో ఉన్న వ్యర్థాలను తొలగించి స్థలాన్ని చదును చేసి బయోమైనింగ్ చేసే సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

- మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

దుర్వాసన రాదు, కాలుష్యం వెలువడదు



పట్టణ జనాభా పెరడగంతో వ్యర్థాలు అధికమవుతున్నాయి. చాలీచాలని స్థలంలో టన్నుల కొద్దీ చెత్తను డంప్ చేయడం ఇబ్బందిగా ఉంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన యార్డు ఏర్పాటుకు 20 ఏకరాల స్థలం అవసరమని ఉన్నతాధికారులను నివేదించాం. బయోమైనింగ్ విధానం అమలు జరిగితే సమస్య పరిష్కారం లభిస్తుంది. నూతన బయో విధానంతో దుర్వాసన, పొగ, కాలుష్యం వెలువడదు.

- వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

» రెండో సారి విక్రయిస్తూ పట్టుబడితే పీడీయాక్టు
» రైతు సమస్యల పరిష్కారానికి సెల్ నంబర్ 8977751296
» నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్ కుమార్



వానాకాలం సీజన్ మరో 15 రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది. ఈ నెలాఖరులో వర్షాలు కురిస్తే రైతులు విత్తనా లు వేసేందుకు సిద్ధమవుతారు. దీనిని దృష్టి లో ఉంచుకొని నాణ్యమైన పత్తి,వరి విత్తనాలు అందుబాటులో ఉంచింది. అయితే నకిలీ విత్తనాలు కూడా విక్రయించేందుకు కొందరు దళారులు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా డీఏవో పి.శ్రవణ్ కుమార్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: ఈ సీజన్‌లో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయి?

జేడీఏ: పత్తి, వరితో పాటు ఇతర పంటలు 11.54 లక్షల ఎకరాల్లో సాగు కానున్నాయి. ఇందుకు సంబంధించి ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచాం. పత్తి విత్తనాలు 13 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉండగా లక్షల క్వింటాళ్ల వరకు వరి విత్తనాలు అందుబాటులో ఉంచాం. 450 గ్రాముల పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.901 ఉండగా, 25 కిలోల వరి విత్తనాల బ్యాగ్ రూ.900 నుంచి రూ.1,200 వరకు ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జేడీఏ : జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. ఇందులో వ్యవసాయశాఖతో పాటు రెవెన్యూ, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేస్తాయి. ఎక్కడైనానకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు సమాచారం లభించిన వెంటనే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రెండోసారి కల్తీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తాం జిల్లాలో రైతుల సమస్యల పరిష్కారానికి సెల్ నంబర్ 8977751296 అందుబాటులో ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: విత్తనాల కొనుగోలులో రైతులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

జేడీఏ : జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌లు కలిగిన 970 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదును తప్పనిసరిగా తీసుకోవాలి. కొందరు రైతులు పక్క రాష్ట్రాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. అక్కడ కూడా లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలను తీసుకోవాలి. బీటీ-3 విత్తనాలపై కేంద్రం నిషేదం విధించింది. వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దు. జిల్లా లో బీటీ -1, బీటీ -2 విత్తనాలు 20 కంపెనీలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎరువులు ఏ మేరకు అందుబాటులో ఉన్నాయి?

జేడీఏ: గతేడాది వానాకాలం సీజన్‌లో 70వేల మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించాం. ప్రస్తుతం జిల్లాలో 26 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. మార్క్‌ఫెడ్‌లో 18వేల మెట్రిక్ టన్నుల యూరియా, మండలాలల్లో 8వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఎరువులు, విత్తనాలకు ఎలాంటి కొరత లేదు.

ఆంధ్రజ్యోతి: సన్నరకాలకు ఎంత బోనస్ చెల్లించారు?

జేడీఏ: గత వానాకాలంలో 15,879మంది రైతులకు సన్న రకాలకు సంబంధించి క్వింటాళ్లు రూ.500 చొప్పున రూ.37కోట్లకు పైగా బోనస్‌ను ప్రభుత్వం చెల్లించింది. ఇటీవల యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 2,263 మంది రైతుల నుంచి 16వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేసి బోనస్ కింద రూ.8 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

కాంగ్రెస్ సీనియర్ నేత మధుసూదన్‌రెడ్డి మృతి



మధుసూదన్‌రెడ్డి(ఫైల్)

మునుగోడు రూరల్, మే16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కొంపల్లి పెద్ద చెరువు మాజీ చైర్మన్ వెదిరె మధుసూదన్‌రెడ్డి(95) శుక్రవారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరారు. అక్కడ తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. ఆయన మృతదేహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీత హైదరాబాద్ ఆస్పత్రిలో మధుసూదన్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే మధుసూదన్‌రెడ్డి మృతి వార్తను తెలుసుకున్న గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు. మధుసూదన్‌రెడ్డి చిన్న వయస్సు నుంచి కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేశారని గ్రామంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. మధుసూదన్‌రెడ్డి అంత్యక్రియలు కొంపల్లిలో శనివారం నిర్వహించనున్నట్లు వెదిరే ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మెగారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, వట్టికోటి శేఖర్, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీమనపల్లి సైదులు, జిల్లా నాయకులు వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512.70
టీఎంసీలు	136.6461
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	450 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	26.17 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	634.80 అడుగులు
టీఎంసీలు	2.15
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	489.11క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	77.35 క్యూసెక్కులు

లక్ష్మీ నరసింహస్వామికి వైభవంగా సువర్ణపుష్పార్చన

యాదగిరిగుట్ట, మే 16(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో ఆర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులు మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి వారి కి నిత్యపూజలు, యాగశాలలో చండీ హోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 44,63,041 రాగా ఇందులో అద్దెల ద్వారా రూ. 19,96,817 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.



ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



సూర్యహారతి ఇస్తున్న అర్చకుడు

కనగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు చేశారు. చీర సారె, ఒడిబియ్యం, బోనం నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఉదయం వైశాఖ మాసం శుక్రవారం శ్రీసంకష్ట చతుర్ది సందర్భగా ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి ఈఓ జయరామయ్య పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

చెర్వుగట్టుపై కొబ్బరి కాయల దుకాణం సీజ్

నార్కట్‌పల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): టెండర్ బకాయిలు చెల్లించకపోవడంతో నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంపై కొబ్బరికాయల విక్రయ దుకాణాన్ని దేవస్థానం అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. గుట్టపై కొబ్బరికాయల విక్రయం కోసం గతేడాది నిర్వహించిన వేలం పాటలో రూ.72.66 లక్షలకు వేలం హక్కును కైవసం చేసుకుని ఇప్పటివరకు కొన్ని డబ్బులు చెల్లించాడు. ఇంకా రూ.19 లక్షలు చెల్లించాల్సి ఉంది. అయితే వేలం కాలపరిమితి ఇంకా రెండు నెలలే మిగిలి ఉండటంతో వేలం డబ్బులు కట్టనందుకు ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు షాపును సీజ్ చేసినట్లు గుట్టపై టెండర్ల నిర్వహణ బాధ్యతను పర్యవేక్షించే ఉద్యోగి ఈ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బందితో కొబ్బరికాయల విక్రయం చేపడుతామన్నారు.

27 నుంచి షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న చైర్మన్, సభ్యులు

చింతపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో ఈ నెల 27 నుంచి 29 వరకు అష్ట దశమ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ట్రస్టు చైర్మన్ మంచికంటి ధ నుంజయ్య తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయిసన్నిధిలో ట్రస్టు సభ్యులతో కలిసి ఆయన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హిం దూ ధర్మ పరిరక్షణ కోసం ఆలయంలో 250 గోవులను పెంచుతున్నామన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాలను ము క్యామాల పీఠాధిపతి శ్రీధర్‌స్వామి, చండీ ఉపాసకు లు కొడకండ్ల శ్రీరాంచరణ్‌శర్మ, శానకొండ శివకిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టీ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పద్మ

భూదాన్‌పోచంపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో నిర్వహిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళీ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ కోరారు. భూదాన్‌పోచంపల్లిలో శుక్రవారం చేనేత కార్మికులకు, చేనేత పద్మశాలి సంఘాల నాయ కులకు ఐఐహెచ్‌టీలో నిర్వహించే డీహెచ్‌టీటీ కోర్సుపై నిర్వహించే అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ (డీహెచ్‌టీటీ)పై 3 ఏళ్ల (6సెమిస్టర్ల ప్రోగ్రాం) అందించే కోర్సుకు ఈ విద్యాసంవత్సరం 2025-26కు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకు కనీస విద్యార్హత ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత (మెరిట్ ఆధారంగా) జనరల్ అభ్యర్థులకు 15- 23 ఏళ్లు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 15-25 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులని తెలిపారు. లాటరల్ ఎంట్రీ (డైరెక్ట్ 2వసంవత్సరం) కోర్సు కు ఇంటర్మీడియట్ (ఎంపీసీ/ ఒకేషనల్)లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. జనరల్ అభ్య ర్థులు 17-23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17-25 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులని తెలిపారు. కోర్సు ఫీజు, పుస్తకాలు, పరీక్ష ఫీజులతో సహా సంవత్సరానికి రూ. 6వేలు ఖ ర్చు అవుతుందని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో 60 మందికి ప్రవేశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కోర్సు మొ త్తం కాలానికి అన్ని విద్యార్థులకు నెలకు రూ. 2,500 చొప్పున స్టైఫండ్, ప్రతి ఏడాది రెండు ఉచిత యూనిఫామ్స్ అందిస్తుందన్నారు. భార త ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖలోని చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం ఎన్‌హెచ్‌డీపీ పథకం కింద చేనేత కుటుంబాలకు నెలకు రూ. 5వేల స్టైఫండ్ పొందవచ్చునని తెలిపారు. తల్లిదండ్రులు చెల్లుబాటు అయ్యే వీవర్స్ ఐడీ కార్డు(న్యూఢిల్లీలోని చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం జారీ చేసిన పెహచాన్ కార్డు) కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. విశేష బోధనం అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన ఉంటుందని, కేంద్ర మౌలిక సదుపాయాలు, ప్రయోగశాల సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. 100 శాతం ఉద్యోగ అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏడీవో, పర్సన్ ఇన్‌చార్జి రాజేశ్వర్ రెడ్డి, సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు, చేనేత అంకం పాండు, కార్యవర్గం సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● ఉమ్మడి నల్లగొండ రీజియన్ పరిధిలోని ప్రతి డిపో నుంచి 5 సర్వీసులు

నల్లగొండ, మే16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 26 వరకు పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుణ్యస్నానాలకు వెళ్లే భక్తుల సౌకర్యం కోసం నల్లగొండ రీజియన్ పరిధిలోని 7 డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను నడిపిస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లే అవకాశం ఉండటంతో భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపనున్నారు. సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కొద్ది రోజుల క్రితమే అన్ని డిపోల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి డిపో నుంచి 5 సర్వీసులు నడపాలని అధికారులు నిర్ణయించారు. అయితే నార్కట్‌పల్లి డిపో నుంచి మాత్రం రెండు సర్వీసులు నడపనున్నారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమమైన ప్రాంతమైన సరస్వతి నది ప్రాంతమైన కాళేశ్వరం ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇప్పటికే తరలివెళ్లనున్నారు. ఇందుకు అనుగుణంగా రీజియన్ పరిధిలో డీలక్స్‌లు, సూపర్‌లగ్జరీ బస్సులను మాత్రమే నడిపిస్తున్నారు. ప్రత్యేక బస్సు లు అయినందున మహాలక్ష్మి స్కీం కింద మహిళలకు ఉ చిత ప్రయాణాన్ని అనుమతించరు. యాదగిరిగుట్ట డిపో నుంచి ఎక్స్‌ప్రెస్ ఉన్నప్పటికీ మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు.

బస్సు టికెట్ చార్జీలు ఇలా..

స్టేషన్	బస్సు రకం	పెద్దలు	పిల్లలకు
దేవరకొండ	డీలక్స్	1500	800
కోదాడ	సూపర్ లగ్జరీ	1200	700
మిర్యాలగూడ	సూపర్ లగ్జరీ	1500	800
నల్లగొండ	డీలక్స్	1000	600
నార్కట్‌పల్లి	డీలక్స్	1000	600
సూర్యాపేట	డీలక్స్	1100	600
యాదగిరిగుట్ట	ఎక్స్‌ప్రెస్	900	500

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిరోజు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడుపుతాం. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను కేటాయిస్తాం. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశాం

- కె.జానిరెడ్డి, నల్లగొండ ఆర్ఎం

మాన్యం భూములపై నజర్

(5వ పేజీ తరువాయి)

వాటికి ఫెన్సింగ్ వేసి, బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పెద్దఎత్తున భూముల ఆక్రమణలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ పెద్దఎత్తున భూములు ఆక్రమణలకు లోనయ్యాయని తెలుస్తోంది. భూముల విలువ కోట్లలోకి చేరడంతో వీటిని సంరక్షించడం అధికారులకూ తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. ఉదాహరణకు సూర్యాపేట జిల్లా బూరుగడ్డ వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన మొత్తం 581 ఎకరాల భూములు కౌలుదారుల చేతిలో బందీ అయ్యాయి. దాదాపు 30 ఏళ్లుగా వారి ఆధీనంలోనే ఉండడంతో దేవాదాయశాఖ అధికారులు కూడా అదుపు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల గ్రామస్తులంతా నిలదీసిన క్రమంలో నామమాత్రపు కౌలు ఇస్తున్నారని చెబుతున్నారు. ఈ భూముల్లో కబ్జాలు సైతం యథేచ్ఛగా సాగుతున్నాయి. భూముల్లో ఏకంగా ఇళ్లను నిర్మిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నివారించాల్సిన అధికారులు ఇళ్ల నిర్మాణదారుల నుంచి లంచాలు తీసుకొని మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. హుజూర్‌నగర్ రామాలయం సంబంధించి 450 ఎకరాల భూమి ఉండగా, పెద్దఎత్తున కబ్జాకు లోనయినట్లు తెలుస్తోంది. పట్టణ సమీపంలోనే ఈ భూములున్నా కబ్జాలను నివారించలేకపోతున్నారు. ఈ భూముల కబ్జాలు చేసిన వారు ఏకంగా ఎకరం రూ25లక్షల వరకు అమ్మేస్తున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. గుర్రంపోడు మండలంలోనూ కొప్పోలు సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల ఆక్రమణలపై తరచూ గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నా సర్వే చేసి నిగ్గుతేల్చలేకపోతున్నారు. ఈ ఆలయానికి దాదాపు 81 ఎకరాల భూమి ఉండగా, దాదాపు 40 ఎకరాల భూమి కబ్జాకు లోనయిందనే ఫిర్యాదులున్నా యి. ఆలయ కమిటీ తరఫున పలుమార్లు సర్వే కు ఉన్నతాధికారులకు విన్నవించినా ఏదో ఒకసాకుతో తప్పించుకుంటూ వస్తున్నారు. కబ్జాదారులకు రాజకీయ నాయకుల అండదండతోనే ఆలయ భూముల సర్వే సాగకుండా అడ్డుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా ఇలా పలు ఆలయ భూములు భారీగా కబ్జాకు లోనయ్యాయని, సర్వేతో వీటన్నింటికీ చెక్‌పడడంతో పాటు దేవాదాయశాఖ భూములు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయని, తద్వారా ఆలయాల మనుగడకు తోడు, ఉత్సవాల నిర్వహణ ధూప, దీప నైవేద్యాలకు, అర్చకుల జీవనోపాధి మెరుగవుతుందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

జిల్లా	దేవాదాయశాఖ భూములు	ఆక్రమణలకు లోనైన భూములు
నల్లగొండ	5429.03	688.34
సూర్యాపేట	6963.32	1374.35
యాదాద్రిభువనగిరి	2377.09	645.38
మొత్తం	14,769.44	2708.07



కూలిన విద్యుత్ స్తంభం : పట్టించుకోని అధికారులు

శాలిగౌరారం, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజపురం గ్రామంలోని ఏర్పుల జానయ్య వ్యవసాయ బావి వద్ద పది రోజుల క్రితం వీచిన భారీ ఈదురుగాలులకు రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విషయం తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పేదలకు ఇవ్వాలి

చిట్యాల రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పూర్తి చేసి పేదలకు అందజేయాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండ్రాంపల్లి గ్రామంలో 56 ఇళ్లను మంజూరు చేసి పేదలకు పంపిణీ చేయకపోవడం శోచనీయమని అన్నారు. సమావేశంలో నాయకులు కత్తుల యాదయ్య, లక్ష్మయ్య, మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

మునుగోడు, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకయ్య అన్నారు. మునుగోడులో పారిశుధ్యం, వర్మీ కంపోస్టు తయారీపై శుక్రవారం చండూరు, మునుగోడు, గట్టుప్పల్ మండలాల స్థాయిలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, మల్టీ పర్పస్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. నిర్దేశించిన ప్రకారం పల్లెప్రగతి లక్ష్యాలను పక్కాగా నెరవేర్చాలని ఆదేశించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టు తయారీ చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. తద్వారా గ్రామాల ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డీఎల్పీవోలు వెంకటేశ్వర్లు, రాఘవరావు, శంకర్‌నాయక్, మునుగోడు, చండూరు, గట్టుప్పల్ ఎంపీడీవోలు విజయ్‌భాస్కర్, యాదగిరి, మాధవరెడ్డి, ఎంపీవోలు, కార్యదర్శులు, మల్టీ పర్పస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో కురిసిన అకాల వర్షం

● చల్లబడిన వాతావరణం



కేతేపల్లిలో కురుస్తున్న వర్షం

కేతేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఉధృతమైన గాలితో ప్రారంభమైన వర్షం శుక్రవారం ఉదయం వరకు అడపాదడపా కురుస్తూనే ఉంది. దీంతో వాతావరణం చల్లబడి వానాకాలాన్ని తలపించింది. నాలుగైదు రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ క్రమంలో కురిసిన భారీ అకాల వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు సేదదీరారు. వర్షం ధాటికి భూములు నానిపోయి ఉండటంతో రైతులు వేసవి దుక్కులకు సిద్ధమవుతున్నారు.

విధులకు డుమ్మా కొట్టిన టీచర్‌కు జీతం ఇచ్చిన అధికారిపై చర్య తీసుకోవాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

నల్లగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): చందంపేట మండలం పోలేపల్లి కాంప్లెక్ పరిధిలోని కుర్రతండా పాఠశాల టీచర్ జూలై నుంచి విధులకు హాజరు కాకున్నా నెలవారీ జీతం ఇచ్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కుర్రతండా పాఠశాలకు చెందిన టీచర్ జూలై నుంచి పాఠశాల విధులకు హాజరుకావడం లేదని అన్నారు. కానీ నెలవారీ జీతం తీసుకున్నారని, ఈ విషయంపై డీఈవోకు, కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డీఈవో విచారణ అధికారిని నియమించి, ఆ విషయం నిజమని నిర్ధారణ చేశారని కానీ ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పాఠశాల విధులకు సంవత్సర కాలం పాటు హాజరుకాకున్నా జీతం చెల్లించిన కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈవోపై తక్షణమే చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో సంఘం ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముందు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న రాములు

నాంపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని, వారికి ఆర్థికంగా అండగా ఉంటుందని సుంకిశాల తాజామాజీ సర్పంచ్ భాషపాక రాములు అన్నారు. శుక్రవారం మెళ్లవాయి గ్రామానికి చెందిన అబ్బనబోయిన యాదయ్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స చేయించుకున్నాడు. శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో సీఎం సహాయనిధి నిరుపేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

శాంభవీదేవికి ప్రత్యేక పూజలు

చిట్యాలరూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడ గ్రామంలోని శ్రీమహమ్మాయి శాంభవీదేవి ఆలయంలో వైశాఖమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి నేరడకు చెందిన కొమ్మోజు శ్రీనివాస్,అరుణ దంపతులు అభిషేకాలు చేశారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. పురోహితులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

ఆవులు, గేదెల పట్టివేత

కేతేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న ఆవులు, గేదెలను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామ శివారులోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేతేపల్లి ఎస్‌ఐ శివతేజగౌడ్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మూడు మినీ వ్యాన్‌లు టోల్‌ప్లాజాలోకి వచ్చాయి. వాటిల్లో ఉన్న వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీసులు గమనించి వాహనాలను తనిఖీ చేశారు. దీంతో ఒక వాహనంలో గేదెలు, మరో రెండు వాహనాల్లో ఆవులు, లేగదూడలు బంధించి ఉండటాన్ని గమనించారు. ఆయా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మండల పశువైద్యాధికారి నవజీవన్‌ను సమాచారం అందించారు. ఈ మేరకు ఆయన సంఘటనా స్థలానికి వచ్చి వాహనాల్లోని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వాటికి నీరు, మేత ఇవ్వకుండా బంధించి అక్రమంగా తరలిస్తున్నారని తేలడంతో వాటిని గోశాలలకు తరలించారు. ఆవులు, గేదెలను అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలపై, అందులో ఉన్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ ఎ.శివతేజ వివరించారు.

గేదెల పట్టివేత

చిట్యాల: డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నసీహ తెలిపారు. చిట్యాల శివారులో రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎంలో అక్రమంగా 35 గోవులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డీసీఎం డ్రైవర్ హైదరాబాద్‌కు చెందిన ఎండీ ఇస్మాయిల్‌తో పాటు లారీలో ఉన్న మరో ఇద్దరు సయ్యద్‌గౌస్, బాణోతు భద్రును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

క్రీడోల్లాసం

- వివిధ క్రీడాంశాల్లో చిన్నారుల శిక్షణ
- కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- జిల్లాలో 13 కేంద్రాల్లో నిర్వహణ
- ఉల్లాసంగా గడుపుతున్న విద్యార్థులు



ఉరుమడ్ల సమ్మర్ క్యాంపులో హాకీ ఆటలో నిమగ్నమైన చిన్నారులు

నల్లగొండ స్పోర్ట్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏడాది మొత్తం చదువులతో కుస్తీలు పడతారు. ఆటలు పక్కనపెట్టి చదువులో లీనమవుతారు. వేసవి సెలవులు రాగానే ఆటల సందడిలో మునిగి తేలుతారు. జిల్లా యువజన, క్రీడల ప్రాధికార సంస్థ (డీవైఎస్‌ఏ) ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని 13 కేంద్రాల్లో వేసవి ప్రత్యేక క్రీడా శిబిరాలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని బాల, బాలికల్లో మానసిక ఆనందం కలిగించేందుకు క్రీడలపై ఆసక్తిని పెంచాలని ఆశయంతో డీవైఎస్‌వో ఈ ఏడాది జిల్లాలోని ఏర్పాటు చేసిన 13 శిక్షణ కేంద్రాల్లో 10 క్రీడాంశాల్లో సమ్మర్ స్పెషల్ క్రీడా శిక్షణ శిబిరాలు ఆహ్లాదకరంగా సాగుతున్నాయి. ప్రతీరోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఫిజికల్ డైరెక్టర్స్, సీనియర్ ప్లేయర్స్ ప్రత్యేకంగా బాల, బాలికలకు ఆటల్లో మెళకువలను నేర్పిస్తున్నారు. నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చే శిక్షకులకు గౌరవ వేతనం రూ.5 వేల రూపాయలు చెల్లించనున్నారు. దీంతో శిక్షణ కేంద్రాలు విద్యార్థులతో సందడిగా మారాయి. వాలీబాల్, హ్యాండ్ బాల్ క్రీడకు సంబంధించిన క్రీడా పరికరాలు మాత్రమే స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఇప్పటి వరకు సరఫరా చేసింది. మిగిలిన క్రీడలకు సంబంధించిన క్రీడా మెటీరియల్స్ అందాల్సి ఉంది.

శాట్ నుంచి అందని క్రీడా మెటీరియల్స్....

జిల్లా యువజన, క్రీడల ప్రాధికార సంస్థ (డీవైఎస్‌ఏ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ స్పెషల్ క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న బాల, బాలికలకు ఇప్పటివరకు క్రీడా పరికరాలు అందక ఇబ్బంది పడుతున్నారు. కేవలం వాలీబాల్, హ్యాండ్ బాల్, హాకీ మెటీరియల్స్, బాక్సింగ్ క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలు మాత్రమే సరఫరా చేశారు. క్రీడా శిబిరాలు 15 రోజుల నుంచి కొనసాగుతున్న ఇప్పటివరకు మిగిలిన క్రీడాంశాలకు సంబంధించిన క్రీడా పరికరాలు అందజేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

(డీవైఎస్‌ఏ), పలు అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో...

స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 15 కేంద్రాల్లో ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నడుస్తున్నాయి. అదేవిధంగా వాలీబాల్ అసోసియేన్ ఆధ్వర్యంలో రెండు, క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు, తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి.

శిక్షణ శిబిరాలను సజావుగా నిర్వహించాలి



జిల్లా యువజన, క్రీడల ప్రాధికార సంస్థ (డీవైఎస్‌ఏ) ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న 13 వేసవి శిక్షణ శిబిరాలు, అదేవిధంగా డీవైఎస్‌ఏ, పలు అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 21 కేంద్రాల్లో శిక్షణ శిబిరాలు సజావుగా నిర్వహించాలి. డీవైఎస్‌ఏ నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం సమయంలో తప్పనిసరిగా కేటాయించిన క్రీడాంశాల్లో తర్ఫీదు కొనసాగించాలి. పీడీలు, సీనియర్ ప్లేయర్లు సమయపాలన పాటించాలి.

- కుంభం నర్సిరెడ్డి, డీవైఎస్‌వో

కొనసాగుతున్న స్పెషల్ సమ్మర్ క్రీడా శిక్షణ శిబిరాలు



నల్లగొండ ఇండోర్ స్టేడియంలో బాల్‌బాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గల చింతపల్లి మండలంలోని కుర్మేడు, హాలియా హైస్కూల్ మైదానాల్లో కబడ్డీ, తిప్పర్తి మండలం మామిడాల, కట్టంగూరు మండలంలోని చెరువుఅన్నారం హైస్కూల్ మైదానంలో హ్యాండ్‌బాల్, గుర్రంపోడు మండలంలోని కొప్పోలు, నిడమనూరు మండలంలోని వెల్మకన్నె హైస్కూల్ మైదానంలో వాలీబాల్, నార్కట్‌పల్లి మండంలోని నెమ్మాని హైస్కూల్లో ఖోఖో, చిట్యాల మండలంలోని ఉరుమడ్ల హైస్కూల్లో హాకీ, నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ప్రైవేట్ స్కూల్ మైదానంలో జూడో, గట్టుప్పల మండల కేంద్రంలోని హైస్కూల్లో బాల్ బ్యాడ్మింటన్, అర్బన్ ప్రాంతాలైన నల్లగొండ, మిర్యాలగూడ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాల్లో షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్ వంటి క్రీడాంశాల్లో శిక్షణ పది రోజుల నుంచి కొనసాగుతుంది. సమ్మర్ స్పెషల్ క్రీడా శిక్షణ శిబిరాలు ఈ నెల 31వ తేదీన ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన బాల, బాలికలందరికి సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

వీధి వ్యాపారులకు ఉపశమనం

నల్లగొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో వీధి వ్యాపారుల కోసం గత ప్రభుత్వం ఎన్‌జీ కళాశాల ప్రహరీ ఆనుకొని డబ్బా కోట్లు (బడ్డీ) ఏర్పాటు చేసింది. అవి ఇరుకుగా ఇబ్బందికరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. దీంతో మునిసిపల్ అధి కారులు వాటిని తొలగించి నూతనంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చిరు వ్యాపారులు తమ తమ సామగ్రిని షెడ్డులోకి మార్చుకొని ప్రస్తుతం ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. తొలగించిన డబ్బా కొట్లు ఖాళీ స్థలానికి తరలించారు.



తొలగించిన డబ్బా కోట్లు



● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

నల్లగొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఎన్‌జీ కళాశాల ప్రహరీకి ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు



రేకులషెడ్డులో వ్యాపారం నిర్వహించుకుంటున్న వ్యాపారులు



రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన కుండలు



జ్యూస్, టీ, కాఫీ దుకాణాలు

నో సర్వీస్

- నీలగిరిలో పనిచేయని ఏటీఎంలు
- 50శాతానికి పైగా పనిచేయని పరిస్థితి
- నగదు డ్రా కాక ఖాతాదారుల ఇబ్బందులు
- పట్టించుకోని బ్యాంకర్లు, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు



నల్లగొండ పట్టణంలో పనిచేయని ఏటీఎం

నల్లగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలో ఏటీఎంలు మూగ బోతున్నాయి. 50 శాతంకు పైగా ఏటీఎంలు పనిచేయక పోవడంతో నగదు డ్రా కాక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలు ఏటీఎంలు ఎందుకు పనిచేయడం లేదో కూడా అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏటీఎంలు ఏర్పాటు చేసిన బ్యాంకర్లు రానురాను పట్టించుకోవడమే మానేశారు. ప్రధానమైన బ్యాంకులు సైతం పనిచేయని ఏటీఎంలపై నిర్లిప్తంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. బ్యాంకుల సేవలను విస్తరించాల్సిన బ్యాంకర్లు ఏటీఎం పట్ల పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. కొద్దిపాటి నగదు అంటే రూ.100 నుంచి మొదలుకొని రూ. 40 వేల వరకు ప్రతీరోజు ఏటీఎంల నుంచి డ్రా చేసుకునే వీలుంటుంది. డబ్బు అవసరం ఉన్న ఖాతాదారులు కొద్దిపాటి డబ్బు కోసం బ్యాంకుకు వెళితే మీకు ఏటీఎం కార్డు లేదా బ్యాంకు టూ బ్యాంకు ట్రాన్స్‌ఫర్ యాప్ లేదా అని బ్యాంకు సిబ్బంది ప్రశ్నిస్తారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి అవకాశాలు ఉన్నప్పుడు చిన్నపాటి నగదుకు బ్యాంకుకు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించే పరిస్థితి. ఒకవైపు బ్యాంకుల్లో సిబ్బంది అలా వ్యాఖ్యానిస్తుంటే మరోవైపు ఏటీఎంలు పనిచేయక పోవడంతో ఖాతాదారులకు సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. బ్యాంకర్లతో పాటు వీటిని నిర్వహించే అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు తీవ్ర నిర్లక్ష్యం వహించడం వల్లే సమస్యలు అధికమవుతున్నాయనేది స్పష్టమవుతుంది. అయితే అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు సమ్మెలోకి వెళ్లడం వల్ల సమస్య తలెత్తిందని బ్యాంకర్లు పేర్కొంటున్నారు. నగదు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చాలా ఏటీఎంలలో సాంకేతిక సమస్యలు....

వేసవి తీవ్రతకు తోడు బ్యాంకర్లు ఏటీఎం మిషన్‌లను తరచుగా పరిశీలించకపోవడంతో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ఏటీఎం కార్డు మిషన్‌లో



పెట్టిన వెంటనే కార్డును రిజెక్టు చేసిన విధంగా సమాచారం రావడంతో పాటు ఆఫ్‌లైన్ అంటూ ఏటీఎం స్క్రీన్‌పై కనిపిస్తుంది. దీంతో నగదు అవసరం ఉన్న ఖాతాదారులు మరొక ఏటీఎంను, ఆ ఏటీఎం కూడా పనిచేయకపోతే మరో నాలుగైదు ఏటీఎంలు తిరిగి అలిసిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో సర్వర్ బీజీ వంటి మెసేజ్‌లు రావడం, ఏటీఎంలు పనిచేయక పోవడంతో కార్డులు చెడిపోయాయన్న భావనతో ప్రజలు ఉంటున్నారు. అదేవిధంగా నగదు డిపాజిట్ చేయడానికి కూడా పలు చోట్ల కొన్ని బ్యాంకులు మిషన్ ఏర్పాటు చేసినా అవి కూడా పనిచేయడం లేదు. ఇక ఎండ తీవ్రత సైతం ప్రతీ రోజు 40 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఆ ప్రభావం కూడా ఏటీఎం మిషన్లపై ఉంటుంది. వాస్తవానికి అయితే ఏటీఎంలు ఏర్పాటు చేసిన సెంటర్‌లో ఏసీ వంటి సౌకర్యాన్ని కల్పించాల్సి ఉంది. ఆయా సెంటర్లలో ఏర్పాటు చేసిన ఏసీలు మరమ్మతులకు గురైతే పట్టించుకోవడం లేదు. ఏటీఎంలు ఉన్న సెంటర్‌లో శుభ్రతపై కూడా బ్యాంకర్లు శ్రద్ధ చూపించకపోవడం గమనార్హం. ఖాతాలో నగదు ఎంత ఉందో చూసుకోవడానికి వెళితే కనీసం రశీదు కూడా రాని పరిస్థితులు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం అందులో ప్రింట్ అయ్యే పేపరును కూడా ఏర్పాటు చేయడం లేదు. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలు ఉన్నందున మిషన్లు ఎందుకు అన్న మాదిరిగా బ్యాంకర్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు పనిచేసే ఏటీఎంలలో సైతం నగదును జమ చేయక పోవడంతో చాలా మంది వినియోగదారులు ఏటీఎంలలోకి వచ్చి నిరుత్సాహంగా వెనుదిరిగి వెళ్తున్నారు. కొన్ని చోట్ల ఏటీఎంలనే తొలగించారు. కనీసం బ్యాంకు ముందు ఉన్న ఏటీఎంలు కూడా పనిచేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏటీఎంలు పనిచేయనప్పుడు, నగదు ఏర్పాటు చేయనప్పుడు తమకు ఏటీఎంలు ఎందుకు అన్న ప్రశ్న వినియోదారుల నుంచి ఎదురవుతుంది. జిల్లా కేంద్రంలో ఏటీఎంలు పనిచేయని పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ఎల్‌డీఎం శ్రామిక్‌ను వివరణ కోరగా ఏజెన్సీలు సమ్మెలో ఉండటం వల్ల సమస్యలు వచ్చాయని, ప్రస్తుతం ఏటీఎంలు పనిచేస్తున్నాయని, ఖాతాదారులకు సేవలు అందుతున్నాయని పేర్కొంటున్నారు.

ఏటీఎంలు పనిచేయక ఇబ్బందులు



జిల్లా కేంద్రంలోని పలుచోట్ల ఏటీఎంలు పనిచేయడం లేదు. నగదు డ్రా చేసుకోవడానికి వెళితే టీఎంలు పనిచేయక పోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ ఒక్కరూ దానికి ఫోన్‌పే, గూగుల్ పే చేయడానికి కుదరదు. నగదు అవసరాలు కూడా ఉంటాయి. అయితే బ్యాంకర్లు ఏర్పాటు చేస్తున్న ఏటీఎంలలో సాంకేతిక సమస్యలతో పాటు అనేక ఇతర సమస్యలు ఎదురవుతున్నాయి. ఏటీఎం బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఖాతాదారుల అవసరాలను, సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ప్రతీ దానికి బ్యాంకులోకి వెళ్లడానికి ఇబ్బందులు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ఏటీఎంలు పనిచేసేలా చూడాలి.

- సైదులు, నల్లగొండ

చిరుజల్లుల వర్షం

దేవరకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షాలు కురుస్తుండటంతో పట్టణ ప్రజలు కొంత ఊరట చెందారు. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రత పెరిగి ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు వర్షం కురియడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. వర్షానికి పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ



పెద్దవూర, మే 16(ఆంధ్రజ్యోతి): పెద్దవూర తహసీల్దార్‌గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు నాగర్‌కర్నూల్‌కు బదిలీపై వెళ్లగా పీఏపల్లిలో విధులు నిర్వహిస్తున్న జె.శ్రీనివాస్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

దత్తాశ్రమంలో వైభవంగా వార్షిక వేడుకలు

మిర్యాలగూడ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేకాలనీ సాయిదత్తాశ్రమంలో శుక్రవారం వార్షిక వేడుకలు వైభవంగా నిర్వహించారు. దత్తాత్రేయ, నాగసాయి విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండా శ్రీను మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కల్యాణి, భవాని, సీత, పద్మ, సుకన్య, శారద, ప్రతాప్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

చలువ పందిరి



ఆహ్లాదం ... ఆనందం

చల్లని నీడనందిస్తున్న చలువ పందిరి

(మిర్యాలగూడ రూరల్, ఆంధ్రజ్యోతి)

ఆధునికీకరణ నేపథ్యంలో వేసవితాపాన్ని తీర్చే పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. కానీ ఓ వృద్ధుని ఆలోచన చలువ పందిరిగా మారింది. గ్రామంలో పది మందికి నీడనిచ్చేలా అందమైన పూలతో ఆహ్లాదాన్ని... ఆనందాన్ని పంచుతోంది. మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామంలోని షేక్ జానిమియా తన తోటి మిత్రులతో నాలుగేళ్ల క్రితం నాగార్జునసాగర్ పర్యటనకు కలిసి వెళ్లాడు. అక్కడ కాలనీలో విరజిమ్ముకొని గులాబీ వర్ణంలో ఉన్న పచ్చని తీగ మొక్కను సేకరించాడు. దానిని ఇంటి ముందు నాటాడు. నాటి నుంచి నేటి వరకు తన ఇంటి ముందు పందిరిలా ఎదిగి చల్లని నీడనిస్తోందని జానిమియా తెలిపారు. గ్రామంలోని పలువురు వృద్ధులు ముచ్చట్లు చెబుతూ ఆ చలువ పందిరి కింద సేదతీరుతున్నారు.

పందిరితో చల్లగా ఉంటుంది



సాగర్ వెళ్లినప్పుడు ఈ మొక్క కనిపించింది. దీనిని బఠానీ జాతి తీగ మొక్కగా అక్కడి వారు తెలిపారు. నాలుగేళ్లుగా పందిరి మాదిరిగా రాగా స్నేహితులకు చల్లగా, హాయిగా నీడనిస్తుంది. గ్రామ పంచాయతీకి వచ్చిన ఎంతో మంది ఆఫీసర్లు ఇక్కడ కూర్చొని సేద తీరి వెళ్తుండటం ఆనందంగా ఉంది.

-షేక్ జానిమియా, ఆలగడప

వైకల్యాన్ని శాపంగా భావించొద్దు



భవిత కేంద్రానికి వచ్చిన దివ్యాంగులతో జిల్లా కోఆపరేటివ్ అధికారి పత్యానాయక్

దామరచర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లల అంగవైకల్యాన్ని శాపంగా భావించకుండా ఆదరించి పిల్లల మానసిక, శారీరక వికాసానికి దోహదపడాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి పత్యానాయక్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. భవిత కేంద్రాన్ని ఆధునీకరించడానికి అవసరమయ్యే ర్యాంప్ రేలింగ్, ఎలక్ట్రిఫికేషన్, గ్రిల్స్ ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపయోగపడే ఆధునిక మరుగుదొడ్లను నిర్మించడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శారీరక, మానసిక వికాసానికి దోహదపడే విద్య అందుతుందని, ఫిజియోథెరపీ డాక్టర్ ద్వారా పిల్లలకు రెగ్యులర్‌గా అందించే చికిత్సను తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంఈవో బాలాజీనాయక్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ టీచర్స్ రవి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేసి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రైతుల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు అధిక దిగుబడు లు సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు. త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సాగునీటి సమర్థ వినియోగం, తక్కువ యూరియా వా డకం, విత్తనాల లభ్యత, పంట కోతల గురించి వివరించారు. విత్తనాల కొనుగోలు సమయంలో రశీదులను భద్రపరచడం, సమగ్ర పురుగు, తె గుళ్ల మందుల వినియోగం, చెట్లు నాటడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, కేవీకే శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, జిల్లా ఉద్యానవ న అధికారి అనంతరెడ్డి, నరసింహ, హెచ్ఎం అనంతరెడ్డి, మత్స్యశాఖ అధికారి కృష్ణనాయక్, శ్రీనివాస్‌రావు, చలపతిరావు, జిందా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

అవసరం మేరకు ఎరువులు వాడాలి

హాలియా: భూసార పరీక్ష చేయించుకొని దానికి అనుగుణంగానే అవసరం మేరకు ఎరువులు వాడాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరమ్య తెలిపారు. హాలియా మునిసిపాలిటీ ఇబ్రహీంపేటలో శుక్రవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పాలిటెక్నిక్ కంపసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరమ్య మాట్లాడుతూ తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలని, అవసరం మేరకు రసాయనాలను వాడాలని సూచించారు. నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని, ఎరువులు, విత్తనాల రశీదులను భద్రపరుచుకో వాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను వాడాలని, ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. వేపగింజల కషాయం తయారీ వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో సరిత, ఏఈవోలు నాగయ్య, యుగేందర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో రోడ్లు, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, కర్నాటి సురేష్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం మునిసిపల్ కమిషనర్ సుదర్శన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కాలనీల్లో కొంతకాలంగా శంకుస్థాపన చేసిన రోడ్ల నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రోడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసి సమస్యను పరిష్కరించాలన్నారు. పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుధ్య సమస్య తీవ్రంగా మారిందని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల అంజయ్యయాదవ్, నేతాళ్ల వెంకటేష్, సహదేవ్, శంకరయ్య, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తడకమళ్ల క్రాస్ రోడ్డు వద్ద నిర్మాణాన్ని తొలగించాలి

● బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

మిర్యాలగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నుంచి నల్లగొండ వెళ్లేమార్గంలో తడకమళ్ల క్రాస్ రోడ్డులో కూడలి నిర్మాణాన్ని తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలగాని వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తడకమళ్ల కూడలి వద్ద ప్రజలు, బీసీ సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీ ఆకారం కలిగిన రోడ్డుపై సుందరీకరణ పేరుతో పెద్దగా వలయాకార నిర్మాణం చేపట్టి వాటిలో ఎత్తైన బొమ్మలు అమర్చారని అన్నారు. దీనివల్ల మూడు వైపుల నుంచి వచ్చి పోయే వాహనాలకు ఎదుటి నుంచి వచ్చే వాహనాలు కనిపించక తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వలయాకారాన్ని తగ్గించడం, పూర్తిగా తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండు నరేందర్‌గౌడ్, చౌగాని వెంకన్న గాదగోని మహేష్‌కుమార్, పులి విద్యాసాగర్, అంతటి రాములు, పులి శ్రీనివాస్, దోరేపల్లి రాములు, తెల్లపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కూడలి వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

విద్యార్థుల సమస్యలపై పోరాటం

● ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నరేష్

దేవరకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. దేవరకొండ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనుమతి ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్, రాములు, రాకేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

భూములు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి



జిల్లా సహకార శాఖ అధికారి జారీచేసిన పత్రాలను చూపుతున్న ధనావత్ చిన్న పాండు

మిర్యాలగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ సహకార భూమల విక్రయంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కార్మికులందరికీ న్యాయం చేయాలని, విక్రయించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ హమాలీ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు ధనావత్ చిన్న పాండు డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాద్రిపాలెంలోని ఇండస్ట్రియల్ కాలనీ సమీపంలోని శుక్రవారం సహకార సంఘం భూమిని పరిశీలించారు. సహకార సంఘం భూమిని విక్రయించవద్దని జిల్లా సహకార శాఖ అధికారి పత్యానాయక్ జారీ చేసిన ఆదేశాల ప్రతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన భూమిని కార్మిక సంఘం సభ్యుల అనుమతి లేకుండా విక్రయించారని ఆరోపించారు. ఈ విషయమై గత ఏడాది మార్చిలో కలెక్టర్, సహకార శాఖ అధికారికి తను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన అధికారులు భవిష్యత్తులో భూమిని అమ్మేందుకు కార్మిక సంఘానికి అవకాశం లేకుండా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఏకపక్షంగా భూములు అమ్మిన వారిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గతంలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట హమాలీలు మాలోతు శంకర్, తులసీరాంలు ఉన్నారు.

విద్యార్థులు నేర్చుకున్న అంశాల్లో రాణించాలి



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనయ్య, ఉపాధ్యాయులు

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), మే 16 (ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరాల్లో పాల్గొని నేర్చుకున్న అంశాల్లో విద్యార్థులు రాణించాలని మండల విద్యాధికారి సముద్రాల శ్రీనయ్య అన్నారు. గుడిపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిబిరం శుక్రవారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి శ్రీనయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న దాదాపు 100 విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులు దైనందిన జీవితంలో పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు వారికి నచ్చిన రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. యోగా, చిత్రలేఖనం, క్రీడల వల్ల భవిష్యత్తులో కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ శిబిరం ఇన్‌చార్జి చాట్ల వెంకటయ్య, వై. శ్రీనివాస్, స్వప్న, సీఆర్పీ కరుణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : బీజేపీ



మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న మునిసిపల్ కమిషనర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం బీజేపీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న నిర్మాణాల్లో ఒక్కటి కూడా నిబంధనల మేరకు జరగడం లేదని అన్నారు. వ్యాపార దుకాణాలకు, గృహ అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు వివరించేందుకు, వినతులు అందించేందుకు కార్యాలయానికి వస్తే స్పందించడం లేదన్నారు. కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బంటు గిరి, నాయకులు చిల్లంచర్ల అభి, నక్క రవిబాబు, కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, మోదాల అశోక్, మండల సోములు, నక్క శ్రీను, నల్ల రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో లభ్యమైన మృతదేహం గుర్తింపు

నాగార్జునసాగర్,మే16(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఫైలాన్‌కాలనీ కొత్త వంతెన వద్ద గురువారం లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిసినట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని తార్నాకకు చెందిన సియాజుద్దీన్ (58) అనే వ్యాపారికి కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఎవరికి చెప్పకుండా మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. హైదరాబాద్ నుంచి సాగర్‌కు వచ్చి ఫైలాన్ కొత్త వంతెన వద్ద జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు సియాజుద్దీన్ కుమారుడు అబ్దుల్ మహీమీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె వాయిదా : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి

మిర్యాలగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను అన్ని కార్మిక సంఘాలు చర్చించి జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కేంద్రం 4 లేబర్ కోడ్‌లను అమలుచేస్తోందని విమర్శించారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న 8 గంటల పనిదినాలను రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్రం అనేక చర్యలు చేపడుతోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కోడిరెక్క మల్లయ్య, గుణగంటి రామచంద్రు, బొచ్చు కోటిరెడ్డి, తేలుకుంట్ల పాపిరెడ్డి, భాష తదితరులు పాల్గొన్నారు.

19న సీపీఎం ద్విచక్ర వాహన ర్యాలీ

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఈ నెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు సీపీఎం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ తెలిపారు. మండల, పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా రెడ్‌షర్ట్‌లు ధరించి ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొనాలని కోరారు. అనంతరం సీపీఎం కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక భావనలతో ఆరోగ్యకరమైన సమాజం



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్

నాగార్జునసాగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనలతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని టీటీడీ ఆధ్యాత్మిక వక్త మారం శ్రీనివాస్ అన్నారు. సాగర్ పైలాన్ కాలనీలోని గీతా మందిర్‌లో శుక్రవారం టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రవచనాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో రోజురోజుకూ హింస, ద్వేషం, ఈర్ష్య, అసూయలు పెరుగుతున్నాయన్నారు. సమాజంలో భక్తిభావం తగ్గడం వల్లే ఇలాంటి వాటికి అవకాశం కలుగుతుందన్నారు. ఆధ్యాత్మిక భావనలతో జీవించడం వల్ల మానసిక ప్రశాంతతో ఆర్యోగకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామకృష్ణ, ఆధ్యాత్మిక సాధువులు మల్లిఖార్జున్‌రావు, యాదయ్య, రాములు, వెంకటనారాయణ, వెంకటరత్నం, శ్యాం, శంకర్, సోమయ్య, నాగమణి, భవాని, అరుణ, శ్రీలక్ష్మి, గగన పాల్గొన్నారు.